శ్రావణ మాసమూ, చంద్రకాంతలూ

శ్రావణమాస మొస్తోందనగానే, వాకిలినిండా విరబూసిన రంగురంగుల చంద్రకాంత పూలూ, ఉన్నట్లుండి వచ్చే వానా, పేరంటాలూ; మనోచక్షువుముందు మెదిలి మధురానుభూతిని కలిగిస్తాయి.

"శ్రావణమాసానికీ, చంద్రకాంతలకీ ఏమిటో ఈ అనుబంధం?" అనిపిస్తుంది.— సంపెంగలకు, మల్లెలకూ, సన్నజాజులకూ వున్నంత పరిమళం లేకపోయినా, చంద్రకాంత పూలలో విచిత్రమైన ఆకర్షణవుంది. లేకపోతే, ఆ పూలనుచూడగానే రంగు, రంగుల చీరెలతో, మస్తుగా ముస్తాబయి, పేరంటంవెళ్ళే పడుచులు జ్ఞాపకంరారేమో!

చిన్నతనంలో ఈ చంద్రకాంత పూలంటే ఎంత ఆపేక్షగా వుండేదనీ!

ఆ రోజుల్లో అమ్మమ్మగారి దొడ్డినిండా వనంలా వుండేవి చంద్రకాంత చెట్లు!

తలనెరిసి, పళ్ళూడి, శక్తిసామర్థ్యాలు తగిపోయినా శ్రద్ధగా పూలన్నికోసి దండ అల్లి ఇచ్చేది అమ్మమ్మ!

ఆవిడఇచ్చిన ఎర్రరాళ్ళ దుద్దులకన్నా, జిగినీ గొలుసుకన్నా విలువైనవేమో ఆ దండలు!! చంద్రకాంత పూవులంటే చటుక్కున మామయ్యకూతురు సావిత్రి జ్ఞాపకం వస్తుంది. నాకంటే చిన్నదైనా, పోటీపడి పువ్వులు పూర్తిగా విచ్చుకోనక పూర్వమే కోసుకునేది...

ఆ ఉక్రోషం పట్టలేక, ఆమెను అరటిపాదు చెంతవున్న మురికిగుంటలోకి త్రోసి ఆ తర్వాత అమ్మ కొప్పడితే సముదాయించినమాట నిజమే!

శ్రావణమాసమన్నా చంద్రకాంత పూవులన్నా హృదయం సంతోషము నింపుకుంటుంది. ప్రశాంతంగా ఎండకాసి ఉన్నట్లుండి కారుమబ్బులు కమ్మి, వానకురిసే శ్రావణమాస వాతావరణం ఎంత మనోహరమైనది! కుంభవృష్టి తగ్గిపోగానే నీళ్ళ మడుగుల్లో ఇంకా పడవలు వేసి ఆడుకోవాలనే వుంటుంది. చిన్ననాటి స్మృతులు మళ్ళీ "చిన్న పిల్లయిపోతే!" అనిపింపజేస్తాయి!

ఆ చిన్నతనమంటే ఎంత ఇష్టం లేనిదే వర్డ్స్‌వర్త్‌లాంటి మహాకవులు చిన్నతనాన్ని గురించి కవిత్వం రాస్తారు!

"శిశువు మనిషికి తండ్రి" అని వర్డ్స్‌వర్త్ అనలేదూ?

ఇలాంటివన్నీ తలచుకుని, ఎప్పుడైనా మనసులో రేగుతున్న కోరిక నణుచుకోలేక పడవలు వేస్తే మా ఎదురింటి కాలేజీ కుర్రాళ్ళు చప్పట్లుకొడుతూ, ఓ "రాక్ ఏన్‌రోల్" పాట ఎత్తుకుంటారు...

అదంతా చూసిన వదినె —

"ఏవమ్మా! నీకు నిజంగా అలా ఆడుకోవాలని వుంటుందా? లేక గొప్పకోసమా?" అంటుంది సూటిగా.—

వచ్చే, వచ్చే కోపాన్ని పెదవులక్రింద నొక్కిపెట్టి, నిరాశగా, గాలికి వూగుతున్న పూలమొక్కల్ని చూస్తూ నిలబడిపోతాను...

చిన్ననాటి సరదాలూ, అభిరుచులూ, పెద్దయ్యాక "సిగ్గు, మర్యాద," అనే తెరల చాటుకుపోయి వాడిపోతాయేమో!

"మల్లి"

అబ్బాయిలే కాదు. కొంత మంది అమ్మాయిలు కూడా ఒక్కొక్క సారి ఇలాగే ప్రవర్తిస్తారు. రంగు రంగుల చంద్రకాంతల మాల తలలో తురుముకుని,ఒక సారి "టీ పార్టీ"కివెళ్ళాను.

నేను హాల్లో అడుగు పెట్టే సరికి మాస్నేహితురాలొకమ్మాయి వెంటనే వాకిలంతా వెతికి వచ్చింది...

"ఏమిటి వెదుకుతున్నావ్?" అన్నాను.

"మేక లెక్కడున్నయ్యా అని చూస్తున్నాను" అంది.

అంతా ఫక్కున నవ్వే సరికి నా కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

గొంతు సవరించుకుని:

"ఒకరి అభిరుచిని హేళన చెయ్యటం సమంజసం కాదు" అన్నాను...ఇంతలో క్రిష్టియన్ ఫ్రెండ్ ఫ్లారెన్స్ పరిగెత్తుకుంటూ వచ్చి!

"నీ జడలో, ఆ పూలు చాలా బాగున్నాయి...ఆమాల ఎంత "ఆర్టిస్టిక్" గా వుందని!" అంది.

చిరునవ్వు నవ్వి వూరుకున్నాను.

ఇందాకటి విమర్శలు రేపిన కోపాన్ని ఈ ప్రశంస చల్లార్చిందనే చెప్పవచ్చు.

"అదేమిటి? నీ పాదాలు అంత పచ్చగా వున్నాయి? పసుపు రాసుకున్నావా?" ఫ్లారెన్స్ మళ్లీ అడిగింది.

అప్రయత్నంగా పాదాలను చూసుకున్నాను...

క్రితం రోజు పేరంటం వెడితే పసుపు రాశారు...సబ్బుతో కడుక్కున్నా యింకా పసుపు ఛాయలు వున్నాయి...ఆ విషయం గమనించికూడా పచ్చగావుంటే బావుంటుందనే వూరుకున్నాను.

"ఆకుపచ్చ చెప్పులుకదూ! అంచేత పాదాలు మరింత అందంగా వున్నాయి!! అందంగా కనపడాలని, కనపడని శ్రద్ధ నువ్వు చాలా తీసుకుంటావు" అంది ఫ్లారెన్స్...

తలవంచి చిన్నగా నవ్వాను...

"అసలు పసుపూ, బొట్టూ అనేవి ఆచారాలుగా కాక, అలంకారాలుగా పరిగణిస్తే బాగుంటుంది."

ఫ్లారెన్స్‌కి ఆంధ్రుల అలంకరణ అంటే చాలా ఇష్టం...ఆంధ్రులు "ఆర్టిస్టిక్" గా వుంటారని ఆమె అభిప్రాయం...

కాదని ఎవరనగలరు?

"మీ పూజలూ, వ్రతాలూ అంటే నాకు చాలా సరదా!" అంటుంది...

అవ్వన్నీ మూఢనమ్మకాలని చాలామంది అంటున్నా, ఇతరులు వాటిని గురించి అడిగినప్పుడు గొప్పగా చెప్పడం నాకలవాటు.

నమ్మకాలసంగతెలా వున్నా పూజలన్నా ఉత్సవాలన్నా నాకు చాలా సరదా!

చిన్నప్పటినుండీ, నాలో వేరు పాతుకుపోయిన ఈ అభిరుచిని ఇప్పుడెలా పోగొట్టుకోగలను?

అందుకేనేమో ఎవరైనా పేరంటం పిలిస్తే సందేహించకుండా వెడతాను...

"చక్కని బట్టలు కట్టుకుని పేరంటం వెళ్ళి, తడిసివస్తే ఎంత బాగుంటుంది!!" అని వదినెతో అంటే,—

"ఆ తరవాత జ్వరంవచ్చి పడకపడితే, ఇంకా బావుంటుంది!" అంటుంది!

పేరంటంవెళ్ళి వస్తూంటే, త్రోవలో వానవస్తే చిత్రంగా వుండదూ?

దగ్గరో ఇవేమీ లేకపోతే ఏదైనా చెట్టు క్రింద నిలుచోవలసి వస్తుంది... చెట్టు కొమ్మలు గాలికి పరవశంగా కదులుతూ వుంటాయి... ఆకుల సందులనుంచి, ముత్యాల్లా వాన చినుకులు పడుతూ వుంటాయి...

ఆ చెట్టుక్రింద చేరిన పేరంటాళ్ల సంభాషణ కూడా చాలా గమ్మత్తుగా వుంటుంది...

"మొన్న శుక్రవారంనాడు కొందటండీ!! వందరూపాయలు పోసికొన్నాను—ఈ చీర!! ఎలా తడిసిపోయిందో! పాడువాన ఇప్పుడే రావాలా?" అంటుంది ఒకావిడ!

"ఈ వెల్వెట్ జాకెట్టు మాత్రం! తడిస్తే ఎందుకైనా పనికొస్తుంది టండీ!" మరో కావిడ అందుకుంటుంది—

"అసలు వానొస్తుందని తెలిసీ అంత మంచి బట్టలు ఎందుకు వేసుకు రావాలీ అంట?"

"వానొస్తుందని కల గన్నానా ఏమిటి! నువ్వు మరీ విచిత్రంగా మాట్లాడతావు!! ఇంతకన్నా తక్కువ రకం బట్టలు నాకు లేవు!"

"ఎందుకు తడికావని మా వారు కొప్పడతారు కోమలా! ఎలా?" అంటుంది కొత్తగా పెళ్ళయిన ఓ యువతి!!!

"ఆ వానకి చెటు చూశావా ఎలా వూగిపోతున్నదో!!"

"చాల్లే! నువ్వొక కవయిత్రిలాగా మాట్లాడకు!"

"ఇంతసేపు ఇక్కడే నిలుచుంటే...ఇక ఇంటికివెళ్ళి వంటెప్పుడంట చేసేది?" నేను మాత్రం చేతి రుమాలులో మూటగట్టిన శనగలు ఒకొక్కటి తింటూ మౌనంగా వింటాను...

వాన కురుస్తుంటే- వానలో గిరగిరా తిరగాలని వుండేది చిన్నప్పుడు...

బుద్ధిమంతురాలివలె చదువుకుంటున్న సీతాదేవిని వుసిగొల్పేదాన్ని...

ఆ అమ్మాయి వాళ్లమ్మ వుందో లేదో చూసివచ్చిగాని నాతో వానలోకి వచ్చేది కాదు.

ఒక్కగా నొక్క కూతురుకదూ! వాళ్లమ్మకి ఎంత గారాబమో!

అఆలు దిద్దుకునే మొదలు మూడో ఫారం వరకూ ఒకే బెంచిమీద కూర్చుని చదువుకున్నాం...

'టైఫాయిడ్'కి జుత్తు వూడిపోతే, 'బాబ్' చేసినట్లు వుండే నొక్కులజుత్తుతో సన్నగా, నాజూగ్గా వుండేది సీతాదేవి! జ్ఞాపకాల వీధుల్లో నిత్యసంచారి సీతాదేవి!! చిలిపితనం మూర్తీభవించినట్లుండే, ఆ సీతాదేవి, ఇప్పుడు నలుగురు పిల్లలకు మాతృదేవి. ఇప్పుడామెకు వాన చూసే తీరిక కూడా లేదేమో!

బాధ్యతలు ఎక్కువైపోతే, లోకం సంకు

అతను 'సాన్ఫొరైజ్‌డ్'

లేబిలు చూచి

బట్టను కొని ఉంటే బాగుండేది!

దుస్తులు చాలనట్లుగా క్రుంగిపోయే బాధను తప్పించుకోండి! మీరు నూలు బట్టలు లేక కుట్టి తయారుగా ఉన్న దుస్తులను కొనునపుడు వాటిమీద 'సాన్ఫొరైజ్‌డ్' (*'Sanforized'*) లేబిలును చూడాలని జ్ఞాపకముంచుకోండి. 'సాన్ఫొరైజ్‌డ్' లేబిలుగల బట్టలతో కుట్టిన దుస్తులు చాల సార్లు ఉతికినా కూడ చాలనట్లుగా ఎన్నటికీ క్రుంగవని మీరు నమ్మవచ్చును!

లేబిలు మీద **'సాన్ఫొరైజ్‌డ్'**

గుర్తు ఉన్నదా అని గమనించండి

అలాచేస్తే మీ దుస్తులు చాలనట్లుగా ఎన్నటికీ క్రుంగవు!

రిజిష్టరు చేయబడిన 'సాన్ఫొరైజ్‌డ్' అనే ట్రేడు మార్కునకు అధికారులైన క్లూయట్, పీబోడి అండ్ కంపెనీ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఎ.లో సంస్థాపితము) వారిచే ప్రచురింపబడినది. ఈ కంపెనీ యొక్క కచ్చితమైన ప్రమాణములకు తగినట్లుగా క్రుంగకుండా ఉండే బట్టలమీదనే 'సాన్ఫొరైజ్‌డ్' ట్రేడ్ మార్కు వేయుటకు అంగీకారము యిస్తాము.

వివరములకు: 'సాన్ఫొరైజ్‌డ్' సర్వీస్, 95 మెరీన్ డ్రైవ్, బొంబాయి 2

★ శ్రావణమాసమూ, చంద్రకాంతలూ ★

చితమై పోతుందేమో ననిపిస్తుంది... అందుకే ఒక్కొక్కసారి భవిష్యత్తులోకి తొంగిచూస్తే భయం వేస్తుంది... కాని మరోసారి భవిష్యత్తును తియ్యగానూ, కన్నుల్లో మల్లెపందిరిలాగానూ ఊహించుకుంటే ఆ భయం క్రమంగా నిష్క్రమిస్తుంది. ఆ కాకంలో హరివిల్లులాగ జీవితంలో రకరకాల అనుభూతులు!! అందుకే "జీవితం కూడా అందమైనదే సుమా!" అనిపిస్తుంది...

"వానకురిసి వెలిస్తే. ఎప్పుడో ఒక సారి వస్తుంది, హరివిల్లు! అలాగే జీవితంలో అందం" అంటాడన్నయ్య !!

జీవితంలో సౌందర్యం ఎప్పుడో ఒకసారి అతిథిలావచ్చి వెళ్లిపోతుందని అన్నయ్య అభిప్రాయం!

అంత లోతుగా ఆలోచించటమంటే నా కెందుకో భయం!

ఇలా ఆలోచించి—ఒక అంతిమ నిర్ణయానికి రావటం—మిలమిల మెరిసే, (వినువిధిలో) తారని అందుకోవాలనుకోవటమే ననిపిస్తుంది....

ఏదిఏమైనా, ఎప్పుడూ చంద్రకాంతల మాలలలుతూ—వానలో తడుస్తూ, పేరంటాలకు వెడుతూవుంటే చాలా బాగుంటుందనే నా అభిప్రాయం....

"కరువులో ఎదురుచూసినట్లు, అలా ఎదురుచూస్తావేమిటే, వానకోసం?" అంటుంది అమ్మ-చిన్నగా నవ్వుతూ....

అలా అంటుందే కాని, "మా అమ్మాయికి వానొస్తే ఎంత ఇష్టమనుకున్నారూ!" అంటూ పొరుగింటి సరస్వతమ్మగారితో చెప్పటం నేను చాలాసార్లు విని విసుక్కోక పోలేదు.

వానంటే ఇష్టపడని వాళ్ళు అరుదేమో! తొలకరిజల్లులకోసం ఆకాశంవంక ఆశగా చూసే రైతుబిడ్డనైనప్పుడు నాకుమాత్రం 'వాన' అంటే ఇష్టం ఎందుకుండదూ?

"నీకు తెలీదుకానీ, పేరంటంనుంచి తెచ్చిన శనగలు వేయించితింటే ఎంత బావుంటాయో! తెలీనివాళ్లకి చెప్పినా దండుగ!!" అంటాడు మామయ్య....

మా అత్తయ్య బస్తీలో పుట్టి, బస్తీలో పెరిగి, బస్తిలోకి కాపరం వచ్చింది—.

ఆవిడ అదోరకంగా నవ్వి "స్టౌ" వెలిగిస్తుంది. వాటికోసం తహతహపడేవాళ్లాంటి వాళ్ల సంగతి ఆవిడకేం తెలుసు!

ఆ మాటకొస్తే మామయ్య, 'ఫారిన్' వెళ్ళి రాలేదూ? అయితే మాత్రం శనగలు మర్చిపోయాడా?

ఈ శ్రావణమాసాలూ, ఈ చంద్రకాంత పూవులూ, ఈ వానజల్లులూ, తియ్యని అనుభవాల నిస్తాయి. హృదయఫలకంమీద రంగురంగుల చిత్రాలుగీస్తాయి!! నాగరికత నలుదిసలా శరవేగాన వ్యాపిస్తున్నా, వైజ్ఞానిక రంగంలో ఉజ్వలమైన మార్పులువస్తున్నా శ్రావణమాసం రాగానే గుంపు గుంపులుగా వీధులో మెరిసే పేరంటాళ్ళను చూస్తే మన కళారాధనా, అభిరుచీ, చెదరకుండావున్నాయనే అనిపిస్తుంది.

మనమంతా కోరుకునేది "పాత కొత్తల మేలికలయిక" గనుక ఈ పూజలు ఎప్పుడూ ఇలాగే వుంటే బావుండు ననిపిస్తుంది!

అందుకే శ్రావణమాసం కోసం, ప్రియ నిరీక్షణలాగ, నిరీక్షిస్తాను...

"వస్తున్నా! వస్తున్నా!!" అంటూ మురిపించి, మురిపించి, ఒక్కసారివచ్చే ప్రియ స్నేహితురాలిలావస్తుంది శ్రావణం!

నెచ్చెలి ఇచ్చే ఆనందంలాగ శ్రావణ మాసం, వెలలేని చంద్రకాంతలనూ, అంతకన్నా విలువైన ఆనందాన్నీ ఇస్తుంది.

నలుగురు ఒకచోట కూడటం, పల్లెటూళ్లలో సాధారణంగా పేరంటాలలోనే. ఇతర దేశస్తులవలె మనకు "పార్టీ"లు తక్కువ. పుట్టిన పండక్కి టీపార్టీ, "మారేజిడే"న డిన్నరూ – ఇలా మనకి విందులు చాలా తక్కువ!

అందుచేత నలుగురు ఆడవాళ్ళూ కలుసుకోవాలంటే, మనకి ఉపయోగపడేవి పేరంటాలే. దోసెడు శనగలు, నాలుగు తమలపాకులూ, యిచ్చే ఆనందం, ఏ విందులు, ఏ టీపార్టీలు ఇస్తాయి? నామటుకు నాకు దేముడిగుళ్ళో నూనె దీపాలె ఎలక్ట్రిక్ లైట్లకంటే ఎంతో బావుంటాయి. అంచేత మన దేశంలో మన సంప్రదాయ ప్రకారం జరిగే పేరంటాలే బావుంటాయి. ★



ఓ బొజ్జ గణపయ్యా నీ బంటు నేనయ్యా...!

—ఫోటో: ఎన్. రామకృష్ణ.]